క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలు

మానకొండూర్: మండలంలోని ముంజంపల్లి శివారులో కరీంనగర్–వరంగల్ ప్రధాన రహదారిపై ఓ ద్విచక్ర వాహనదారుడు పడిపోవడంతో తీవ్ర గాయాల పాలయ్యాడు. మానకొండూరు సీఐ మాదాసు రాజకుమార్ తెలిపిన వివరాలు...సైదాపూర్ మండలం చింతలపల్లి గ్రామానికి చెందిన ఓరగంటి సురేశ్(32)యువకుడు గ్రామం నుంచి కరీంనగర్ వెళ్తుండగా ముంజంపల్లి శివారులో పడిపోయాడని, వెంటే 108 వాహనంలో కరీంనగర్‌లోని ఆస్పత్రిలో చేర్పించినట్లు సీఐ తెలిపారు.

మద్యం అమ్మితే చర్యలు

వీణవంక: మండలంలోని పోతిరెడ్డిపల్లి గ్రామంలో అక్రమంగా మద్యం అమ్ముతున్న వ్యక్తిని పట్టుకొని కేసు నమోదు చేశామని ఎస్సై తోట తిరుపతి తెలిపారు. ప్రభుత్వ అనుమతి లేకుండా అక్రమంగా బెల్టుషాపు నిర్వహిస్తూ మద్యం విక్రయిస్తుండగా పక్కా సమాచారంతో తనిఖీ చేసి రూ.16,120 విలువ గల మద్యం స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశామని ఎస్సై వివరించారు. అనుమతి లేకుండా గ్రామాల్లో మద్యం అమ్మితే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని ఎస్సై హెచ్చరించారు.

నగదు పట్టివేత

హుజూరాబాద్‌రూరల్: పట్టణ శివారులోని పర్కాల్‌క్రాస్ రోడ్డు వద్ద ఏర్పాటు చేసిన చెక్‌పోస్టు వద్ద ఆదివారం వాహనాల తనిఖీల్లో భాగంగా నగదు పట్టుకున్నామని టౌన్ సీఐ బొల్లం రమేశ్ తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లోని పశ్చిమగోదావరికి చెందిన బి. ప్రశాంతరావు వద్ద రూ.1,14,000, హన్మకొండ జిల్లా నడికూడ మండలానికి చెందిన బాషబోయిన రాజయ్య వద్ద రూ.76,500 లభించాయని, సరైన ఆధారాలు చూపకపోవడంతో నగదు సీజ్ చేశామన్నారు.

ఎన్నికల నియమావళి ఉల్లంఘన కేసు

వీణవంక: మాజీ సీఎం కేసీఆర్ వీణవంకకు వచ్చిన సందర్భంగా ఎలాంటి అనుమతి లేకుండా టపాసులు పేల్చిన వ్యక్తిపై కేసు నమోదు చేశామని ఎస్సై తోట తిరుపతి తెలిపారు. హుజూరాబాద్‌లోని గాంధీనగర్‌కు చెందిన వ్యక్తి ఎలక్షన్ కమిషన్ నుంచి ఎలాంటి అనుమతి తీసుకోకుండా ఆదివారం సాయంత్రం కేసీఆర్ ర్యాలీ సందర్భంగా టపాసులు కాల్చాడని ఎఫ్‌ఎస్‌టీం ఇన్‌చార్జి రాంకుమార్ ఫిర్యాదు మేరకు ఆవ్యక్తిపై ఎన్నికల నియమావళి ఉల్లంఘన కేసు నమోదు చేశామని ఎస్సై వివరించారు.

ట్రాక్టర్ యూనియన్ కార్యవర్గం


బొట్టు సంపత్


కోహెడ చంద్రశేఖర్

చిగురుమామిడి: మండలంలోని ముదిమాణిక్యం గ్రామంలో ట్రాక్టర్ యజమానులు ఆదివారం యూనియన్ కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. గ్రామంలో సమావేశమై అధ్యక్షుడిగా బొట్టు సంపత్, ఉపాధ్యక్షుడిగా కోహెడ చంద్రశేఖర్‌ను ఎన్నుకున్నారు. అలాగే కార్యవర్గ సభ్యులుగా ఎండీ షరీఫ్, కట్ల శంకరయ్య, ముంజ వెంకన్న, గుడిసె ఓదేలు, దూకి నరేశ్, గుడిసె మల్లికార్జున్‌ను నూతనంగా ఎన్నుకున్నట్లు అధ్యక్షుడు సంపత్ తెలిపారు. ఎన్నికైన కార్యవర్గం యూనియన్ సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తుందన్నారు.

నియామకం

వీణవంక: కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ పార్లమెంట్ మేనేజ్‌మెంట్ కోఆర్డినేటర్‌గా మండలంలోని మామిడాలపల్లి గ్రామానికి చెందిన చింతల శ్యాంసుందర్‌రెడ్డిని నియమించారు. శ్యాంసుందర్‌రెడ్డి మాట్లాడుతూ... నియామకానికి కృషి చేసిన ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్‌కి కృతజ్ఞతలు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని పేర్కొన్నారు.

మహిళల నిరసన



నిరసన తెలుపుతున్న మహిళలు

రామడుగు: కర్ణాటక హసన్ పార్లమెంట్ సభ్యుడు ప్రజ్వల్ రేవణ్ణను తక్షణం అరెస్టు చేయాలని డిమాండ్ చేస్తూ మండలంలోని గోపాల్‌రావుపేట గ్రామంలో కాంగ్రెస్ పార్టీ మహిళా జిల్లా అధ్యక్షురాలు కర్ర సత్యప్రసన్నరెడ్డి ఆధ్వర్యంలో మహిళలు నోటికి నల్లగుడ్డలు కట్టుకొని నిరసన తెలిపారు. మహిళా నాయకులు కవిత, పుష్పలత, తదితరులు పాల్గొన్నారు.

పీసీసీ లీగల్ సెల్ జాయింట్ కన్వీనర్‌గా రజనీశ్

కరీంనగర్ కార్పొరేషన్: పీసీసీ లీగల్ సెల్ జాయింట్ కన్వీనర్‌గా కరీంనగర్‌కు చెందిన భూక్య రజనీష్ నియమితులయ్యారు. ఈమేరకు పీసీసీ లీగల్ సెల్ చైర్మన్ పొన్నం అశోక్ గౌడ్ ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు.


పారువెల్లలో పక్కకు ఒరిగిన స్తంభం


కన్నాపూర్‌లో లూజ్ వైర్లు

ఒరిగిన స్తంభాలు.. వేలాడుతున్న తీగలు

మానకొండూర్: నియోజకవర్గంలోని మానకొండూర్, శంకరపట్నం, గన్నేరువరం మండలాల్లోని పలు గ్రామాల్లో విద్యుత్ స్తంభాలు పక్కకు ఒరిగి, విద్యుత్ తీగలు వేలాడుతూ ప్రమాదాలకు సంకేతాలిస్తున్నాయి. పంట పొలాల వద్ద చేతికందే ఎత్తులోనే వైర్లు ఉండటం, గాలులకు ఒకదానినొకటి తగులుతుండటంతో మంటలు వస్తున్నాయి. దీంతో పంట పొలాల్లోని పశుగ్రాసం, పైపులైన్లు దగ్ధమవుతున్నాయి. కొట్టాల్లోని పశువులు మృత్యువాత పడుతున్నాయి. ఇప్పటికే మానకొండూర్ మండలంలోని గంగిపల్లిలో 200 ఎకరాలకు పైగా పంట పొలాల్లో పశుగ్రాసం, పైపులైన్లు దగ్ధమయ్యాయి. ఏటా లూజ్ లైన్లను సరిచేసేందుకు అధికారులు విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయిస్తున్నా సరిపోవడం లేదు. ఫలితంగా సమస్య తీరడం లేదు. నూతన స్తంభాల ఏర్పాటుకు వేసవి అనువైన సమయమని, వెంటనే చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.


ఈదులగట్టెపల్లిలో చేతికందే ఎత్తులో విద్యుత్ తీగలు

బీజేపీలో పలువురి చేరిక

మానకొండూర్‌రూరల్: మండలంలోని వేగురుపల్లి, లక్ష్మీపూర్, పచ్చునూర్ గ్రామాలకు చెందిన సుమారు 50 మంది కాంగ్రెస్, బీఆర్‌ఎస్ నాయకులు బీజేపీ జాతీయ కార్యదర్శి బండి సంజయ్ సమక్షంలో ఆదివారం బీజేపీలో చేరారు. ఈకార్యక్రమంలో రాపాక ప్రవీణ్, రంగు భాస్కరాచారి, వెంకట్‌రెడ్డి, ప్రభాకర్‌గౌడ్, శ్రీనివాస్, హరీశ్, సంపత్‌గౌడ్, సదానందం తదితరులు పాల్గొన్నారు.

గన్నేరువరం: కరీంనగర్ ఎంపీగా అభ్యర్థి బండి సంజయ్‌ని మరోసారి గెలిపించడమే లక్ష్యంగా పార్టీలో చేరుతున్నామని పారువెల్ల, మాదాపూర్ గ్రామాలకు చెందిన నాయకులు, కార్యకర్తలు తెలిపారు. కరీంనగర్‌లో బండి సంజయ్ సమక్షంలో కాంగ్రెస్, బీఆర్‌ఎస్‌కు చెందిన బోడ బాలరాంరెడ్డి, చెక్కిళ్ల చంద్రయ్య, డాక్టర్ రవీందర్, రాజిరెడ్డి, మార్గం స్వామితో పాటు 60 మంది నాయకులు, కార్యకర్తలు బీజేపీలో చేరారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఏలేటి చంద్రారెడ్డి, కరివేద మహిపాల్‌రెడ్డి, సొల్లు అజయ్‌వర్మ, బద్దం అనంతరెడ్డి, బోడ భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.


మానకొండూర్‌రూరల్: బీజేపీలో చేరిన నాయకులతో బండి సంజయ్‌కుమార్

మోదీతోనే అవినీతి రహిత పాలన

చిగురుమామిడి: మండలంలోని అన్ని గ్రామాల్లో ప్రతి ఇంటికి బీజేపీ కరపత్రం ఓటర్లకు అందజేయాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కోమటిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి కోరారు. ఆదివారం మండలంలోని రేకొండ, ఇందుర్తి, బొమ్మనపల్లి, లంబాడిపల్లి గ్రామాలకు చెందిన శక్తికేంద్రం ఇన్‌చార్జీల ఆధ్వర్యంలో బూత్‌స్థాయి సీనియర్ నాయకులు, కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కోమటిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ.. బీజేపీ ఎంపీ అభ్యర్థి బండి సంజయ్‌కుమార్ చేసిన అభివృద్ధి పనులను ప్రతి ఒక్కరికీ వివరించాలన్నారు. అవినీతిరహిత పాలన సాగాలంటే దేశంలో మూడోసారి నరేంద్రమోదీ ప్రధాని కావాల్సిందేనని, అందుకు కార్యకర్తలు, నాయకులు కష్టపడి పనిచేయాలన్నారు. సమావేశంలో బీజేపీ మండల అధ్యక్షుడు పైడిపెల్లి మల్లేశం, నాయకులు అమరగాని ప్రదీప్‌కుమార్, గందే చిరంజీవి, పడాల శ్రీనివాస్, బొమ్మగాని మధుసూదన్, నక్క రాజేందర్, కంది శంకర్‌పాల్గొన్నారు.


ఇందుర్తిలో మాట్లాడుతున్న రాంగోపాల్‌రెడ్డి

గన్నేరువరం: బీజేపీ కరీంనగర్ ఎంపీ అభ్యర్థి బండి సంజయ్‌కుమార్‌కు మద్దతుగా మండలంలోని చొక్కారావుపల్లెలో అరికాంతపు నర్సింహారెడ్డి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ప్రధాని నరేంద్ర మోదీ సారథ్యంలో భారతదేశం పది ఏళ్లల్లో ఎంతో అభివృద్ధి సాధించి, ప్రపంచం స్థాయిలో దూసుకెళ్తోందన్నారు. ఎంపీగా బండి సంజయ్‌కి ఓటు వేసి మరోసారి కేంద్రంలో బీజేపీ ప్రభుత్వ ఏర్పాటుకు అవకాశం కల్పించాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో బూత్ స్థాయి సభ్యులు గుండ్రెడ్డి వెంకట్‌రెడ్డి, బూర నర్సయ్య, బూర లక్ష్మీరాజం, ఆన్నాడి రాజిరెడ్డిలు పాల్గొన్నారు.

కాంగ్రెస్ అభ్యర్థి తెలియదనడం సరికాదు


రామడుగు: ప్రచారం చేస్తున్న సత్యప్రసన్నరెడ్డి


శంకరపట్నం: మాట్లాడుతున్న రితిక

శంకరపట్నం: కరీంనగర్ ఎంపీగా తన నాన్నకు ఒక్క అవకాశం ఇవ్వాలని, కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి వెలిచాల రాజేందర్‌రావు కూతురు రితిక ప్రజలను అభ్యర్థించారు. ఆదివారం మండలంలోని వంకాయగూడెంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో యూత్ కాంగ్రెస్ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రత్యర్థులు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ఎవరో ప్రజలకు తెలియదంటూ ప్రచారం చేయడం సరికాదన్నారు. మా తాత జగపతిరావు కరీంనగర్ ఎమ్మెల్యేగా, ఎమ్మెల్సీగా చేసిన అభివృద్ధి ప్రజలకు తెలుసన్నారు. ఎంపీగా గెలిపించడానికి యూత్‌కాంగ్రెస్ కార్యకర్తలు సైనికుడిలా పనిచేయాలని కోరారు. ఈసమావేశంలో జిల్లా అధ్యక్షుడు పడాల రాహుల్, ఇసామొద్దీన్, బసవయ్య, షారుక్, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

రామడుగు: మండలంలోని గోపాల్‌రావుపేట గ్రామంలో కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ పార్లమెంట్ అభ్యర్థి వెలిచాల రాజేందర్‌రావుకు మద్దతుగా ఆదివారం కాంగ్రెస్ పార్టీ జిల్లా మహిళా అధ్యక్షురాలు కర్ర సత్యప్రసన్నరెడ్డి ఇంటింటి ప్రచారం చేశారు. మండల పరిషత్ కోఆప్షన్ సభ్యుడు, మహిళా కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

సైదాపూర్: మండలంలోని ఎలబోతారంలో కాంగ్రెస్ నాయకులు ఇంటింటికి తిరుగుతూ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్‌కు ఓటేయాలని కోరారు. ఎంపీలుగా వినోద్‌కుమార్, బండి సంజయ్‌కుమార్‌లు పైసా పని చేయలేదని ఆరోపించారు. రాష్ట్రంలో రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక నాలుగు నెలల్లో ఎన్నికల హామీలు నెరవేర్చారని అన్నారు. కరీంనగర్ ఎంపీ అభ్యర్థిగా వెలిచాల రాజేందర్‌రావుకు ఓటేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో డీసీసీ అధికార ప్రతినిధి రవీందర్, బాషవేని రవీందర్, సీనియర్ నాయకులు రవి, మల్లయ్య, వెంకటస్వామి ఉన్నారు.

6,400 క్వింటాళ్ల ధాన్యం కొనుగోలు

చిగురుమామిడి: మండలంలోని బొమ్మనపల్లి గ్రామంలో నెలరోజులుగా ఐకేపీ ఆధ్వర్యంలో నిర్వహించిన ధాన్యం కొనుగోళ్లు శనివారంతో ముగిశాయి. చివరిరోజు నాటికి 6,400 క్వింటాళ్ల ధాన్యాన్ని 128 మంది రైతుల నుంచి కొనుగోలు చేసినట్లు ఏపీఎం సంపత్ తెలిపారు. ఇప్పటి వరకు 97 మంది రైతులకు ధాన్యం డబ్బులు వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేశామని నిర్వాహకులు తెలిపారు. గత రబీలో 13వేల క్వింటాళ్ల ధాన్యం రైతుల నుంచి కొనుగోలు చేశామని, ఈసారి భూగర్భ జలాలు అడుగంటి పోవడం వల్ల రైతులు వేసిన వరి పంటలు ఎండిపోయాయి. దీంతో యాసంగి చాలా తక్కువగా పంట పండినట్లు చెప్పారు. కాగా హమాలీలు కష్టపడి తూకం వేయడం వల్లే మిగతా గ్రామాల్లోని సెంటర్ల కంటే బొమ్మనపల్లిలో వరి ధాన్యం కొనుగోళ్లు పూర్తయినట్లు పేర్కొన్నారు. కాగా వరి ధాన్యం లేకున్నప్పటికీ చివరి వరకు వరి కోతలున్న రైతుల కోసం మరో పది రోజులు కొనుగోలు కేంద్రం అలాగే ఉంటుందన్నారు. ఇందుర్తి, చిగురుమామిడి ఐకేపీ కొనుగోలు కేంద్రాల్లో ఇంకా ధాన్యం పూర్తిగా తూకం వేయలేదన్నారు. ఆయా గ్రామాల్లో హమాలీల సంఖ్య తక్కువగా ఉన్నందున తూకం ఆలస్యమవుతోందన్నారు.

కేసీఆర్ బస్సుయాత్రకు ఘన స్వాగతం


పూలు చల్లుతున్న బీఆర్‌ఎస్ కార్యకర్తలు

శంకరపట్నం: మాజీ సీఎం కేసీఆర్ చేపట్టిన బస్సుయాత్రకు బీఆర్‌ఎస్ కార్యకర్తలు పూలు చల్లుతూ ఆదివారం స్వాగతం పలికారు. వీణవంక మండలం నుంచి కరీంనగర్ వెళ్తున్న కేసీఆర్‌కు మొలంగూర్, కేశవపట్నంలో బస్సుయాత్రకు గుమ్మడి కాయలతో దిష్టి తీసి పూలవర్షం కురిపించారు. కేసీఆర్ బస్సులో నుంచి నాయకులు, కార్యకర్తలకు అభివాదం చేస్తూ వెళ్లారు. ఈకార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు మహిపాల్, సింగిల్‌విండో చైర్మన్ సంజీవరెడ్డి, ఖాజాఖలీమొద్దీన్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మానకొండూర్: మాజీ సీఎం కేసీఆర్ బస్సుయాత్రలో భాగంగా వీణవంక, కేశవపట్నం నుంచి కరీంనగర్ వెళ్తుండగా మానకొండూర్ చౌరస్తాలో బీఆర్‌ఎస్ నాయకులు పూలతో ఘనస్వాగతం పలికారు. జిల్లా అధ్యక్షుడు జీవీఆర్, జెడ్పీటీసీ శేఖర్, తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారులకు సన్మానం



కరీంనగర్‌రూరల్: రాష్ట్ర, జాతీయస్థాయి ఖేలో ఇండియా స్కూల్ గేమ్స్ యూనివర్సిటీ స్థాయిలో తైక్వాండోలో పలు పతకాలు సాధించిన బబ్బూరి అక్షిత, ప్రవళిక, ఎండీ ఆస్మీన్, ఆసియా, సుప్రియా, మహేశ్‌బాబు, హరీశ్, తిరుమల్‌కుమార్‌లను ఆదివారం కరీంనగర్‌లో జరిగిన సమావేశంలో యాదవ హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో యూనివర్సిటీ అధికారులు రవీందర్‌రెడ్డి, రాకేశ్‌రెడ్డి, సిద్ధు, శోభారాణి, వివేకానంద స్కూల్ చైర్మన్ సొగాని కొమురయ్య, యాదవ ట్రస్టు అధ్యక్షుడు బబ్బూరి కుమార్, యాదవ హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు బండి మల్లన్న, మహాసభ జిల్లా అధ్యక్షుడు దుంద్ర రాజయ్య, నగర అధ్యక్షుడు గాలి రవి, నాయకులు బూస అంజయ్య, రాజయ్య, కొమురయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించాలి

విద్యానగర్(కరీంనగర్): విద్వేష, విభజన రాజకీయాలు చేస్తున్న పార్టీలను ఓడించి ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించాలని రిటైర్డ్ ఐఏఎస్ అధికారి ఆకునూరి మురళీ అన్నారు. ఆదివారం ఉదయం నగరంలోని ఎస్సారార్ డిగ్రీ కళాశాల మైదానంలో వాకర్స్‌తో మాట్లాడారు. రైతు మార్కెట్‌లో రాష్ట్ర ప్రజాస్వామిక వేదిక పార్లమెంట్ ఎన్నికల్లో ఫాసిస్టు బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్, ఎన్డీఏ శక్తులను ఓడిద్దాం పేరుతో ముద్రించిన కరపత్రాలు పంచుతూ ప్రచారం నిర్వహించారు. అనంతరం కరీంనగర్ ప్రెస్‌భవన్‌లో మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామని హామీ ఇచ్చి యువతను మోసం చేసిందని ఆరోపించారు. ప్రొఫెసర్లు పద్మజా షా, లక్ష్మీనారాయణ, జానయ్య, నాయకులుగోవర్ధన్, రాయ్, మాస్‌లైన్ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎం హన్మేశ్, వేణుగోపాల్,పీడీఎస్‌యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.వి.శ్రీకాంత్, కల్పన, మార్వాడి సుదర్శన్, స్వరూప, సౌజన్య, రాణాప్రతాప్, అంజి, తిరుపతి, కుమార్,గౌస్, నిరంజన్ పాల్గొన్నారు.

విచక్షణతో ఓటు వేయాలి

- రాజ్యాంగాన్ని అంతం చేయడమే బీజేపీ, బీఆర్‌ఎస్, కాంగ్రెస్ లక్ష్యం
- డీఎస్పీ కరీంనగర్ ఎంపీ అభ్యర్థి చిలువేరు శ్రీకాంత్

చిగురుమామిడి: పార్లమెంట్ ఎన్నికల్లో పోటీ చేస్తున్న బీజేపీ, బీఆర్‌ఎస్, కాంగ్రెస్ పార్టీలు ఒకే బంధువర్గమని, ఆ మూడు పార్టీలు రాజ్యాంగాన్ని అంతం చేయడమే లక్ష్యంగా పెట్టుకున్నాయని డీఎస్పీ(ధర్మ సమాజ్ పార్టీ) కరీంనగర్ ఎంపీ అభ్యర్థి చిలువేరు శ్రీకాంత్ అన్నారు. ఆదివారం చిగురుమామిడి మండల కేంద్రంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పార్లమెంట్ ఎన్నికల యుద్ధం ప్రారంభమైంది, 10 శాతం ఉన్న అగ్రకులాలు, వారి బంధువర్గం అంతా వివిధ పార్టీల పేరుతో ఎన్నికల్లో పోటీచేస్తున్నారని, అదే 90శాతం ఉన్న బీసీ, ఎస్సీ, ఎస్టీల ఓట్లను కొల్లగొట్టడానికి లొంగదీసుకుంటూ, భయభ్రాంతులకు గురిచేస్తున్నారని విమర్శించారు. అందుకే రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేడ్కర్ బీసీ, ఎస్సీ, ఎస్టీలు రాజ్యాధికారం సాధించడానికి ఓటు అనే ఆయుధాన్ని అందించారని, ఓటర్లు విచక్షణతో ఓటు వేయాలని కోరారు. ఎన్నికల ప్రచారంలో జిల్లా ప్రధాన కార్యదర్శి నరేశ్, సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు బోయిని సదన్‌మహారాజ్, జిల్లెల్ల నవీన్, సురేశ్, వెంకటేశ్, వినయ్, మధు, శ్యామ్ పలువురు పాల్గొన్నారు.


ప్రచారం నిర్వహిస్తున్న శ్రీకాంత్, నాయకులు

భూమయ్య సేవలు మరువలేనివి




పరామర్శిస్తున్న మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్, నివాళి అర్పిస్తున్న ఆకునూరి మురళి

చొప్పదండి: ధర్మపురి నియోజకవర్గంలో ఎంఈవోగా బత్తుల భూమయ్య చేసిన సేవలు మరువలేమని మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ అన్నారు. వెల్గటూర్ ఎంఈవో బత్తుల భూమయ్య వడదెబ్బతో ఆకస్మికంగా మృతిచెందగా ఆదివారం చొప్పదండి పట్టణంలోని భూమయ్య ఇంటికి వచ్చి ఆయన చిత్రపటానికి నివాళి అర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించారు. భూమయ్య కుటుంబ సభ్యులను ఐఏఎస్ ఆకునూరి మురళి ఆదివారం పరామర్శించారు. భూమయ్య చిత్రపటానికి నివాళి అర్పించారు. విద్యాధికారిగా, గ్రామ ప్రత్యేకాధికారిగా, సామాజిక కార్యక్రమాల్లో భూమయ్య సేవలు అమోఘమని కొనియాడారు. ఆయన అకాల మృతి దిగ్భ్రాంతికి గురిచేసిందన్నారు. వెంట కళ్యాం నవీన్ కుమార్, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రిజర్వేషన్లు ఎత్తివేసేందుకు బీజేపీ కుట్ర

- బీసీల సామాజిక, ఆర్థిక సమానత్వం కాంగ్రెస్‌పార్టీతోనే సాధ్యం
- జెడ్పీఫ్లోర్‌లీడర్ గీకురు రవీందర్

చిగురుమామిడి: బీసీ సామాజిక, ఆర్థిక సమానత్వం కాంగ్రెస్‌పార్టీతోనే సాధ్యమని జెడ్పీఫ్లోర్ లీడర్, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు గీకురు రవీందర్ అన్నారు. ఆదివారం చిగురుమామిడిలో బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో బీసీ కులాల అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా బస్టాండ్ చౌరస్తాలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. అనంతరం సదస్సు వరకు ఊరేగింపుగా వెళ్లారు. ఈసందర్భంగా రవీందర్ మాట్లాడుతూ.. పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్‌పార్టీ మేనిఫెస్టోలో కులగణన బిల్లు పొందుపర్చడం పట్ల యావత్తు బహుజన సమాజం హర్షం వ్యక్తం చేస్తుందని, ఏళ్ల తర్వాత కులగణన చేపడతామనడం సహసోపేతమైన నిర్ణయమన్నారు. ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ, మైనార్టీల రిజర్వేషన్లు ఎత్తివేసేందుకు బీజేపీ ప్రభుత్వం కుట్ర చేస్తోందన్నారు. సదస్సుకు మండల బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు కృష్ణమాచారి అధ్యక్షత వహించగా రాష్ట్ర ప్రచారకార్యదర్శి ప్రవీణ్‌కుమార్, మహిళా అధ్యక్షురాలు ముంజ శిరీష, సామాజిక ఉద్యమకారుడు కొయ్యడ కొంరయ్య, నాయకులు బుర్ర శ్రీనివాస్, చెల్పూరి విష్ణుచారి, పూదరి వేణుగోపాల్, గట్టు ప్రశాంత్, తోట సతీష్, పిల్లి తిరుపతి, బోయిని వంశీకృష్ణ, పెసరి శ్రీనివాస్, కత్తుల దేవేందర్, పోతర్ల శివాంజనేయులు, వంగ కనుకయ్య, కొలిపాక శివ దాదాపు 300 మంది పాల్గొన్నారు.


నాయకులతో కలిసి అభివాదం చేస్తున్న రవీందర్

కాంగ్రెస్ పార్టీలో చేరిక

రామడుగు: మండలంలోని దేశరాజ్‌పల్లి గ్రామానికి చెందిన మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఎల్కపల్లి లచ్చయ్య కాంగ్రెస్ పార్టీలో చేరారు. మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్ కాంగ్రెస్ కండువాను కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. లచ్చయ్యతో పాటుగా మరో 50 మంది పార్టీలో చేరారు. కార్యక్రమంలో చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, మాజీ సర్పంచ్ కోల రమేశ్, నాయకులు అమిరిశెట్టి సుధాకర్, పలువురు పాల్గొన్నారు.


కండువా కప్పుతున్న మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్

కాంగ్రెస్ మేనిఫెస్టో క్షేత్రస్థాయిలోకి తీసుకెళ్లాలి

కరీంనగర్ కార్పొరేషన్: లోకసభ ఎన్నికల సందర్భంగా విడుదల చేసిన కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోను క్షేత్రస్థాయిలో తీసుకెళ్లాలని ఆలిండియా ప్రొఫెషనల్ కాంగ్రెస్ మేనిఫెస్టో రీసెర్చ్ విభాగం అధిపతి నావికా హర్షే అన్నారు. ఆదివారం నగరంలోని ఓ ప్రైవేట్ హోటల్‌లో కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గం అఫిషియల్స్, ప్రొఫెషనల్స్‌తో ఏర్పాటు చేసిన ముఖాముఖిలో మాట్లాడారు. దేశంలోని అన్ని వర్గాల ప్రజలకు ఉపయోగకరమైన మేనిఫెస్టోను కాంగ్రెస్ రూపొందించిందని తెలిపారు. ఈ మేనిఫెస్టోను ప్రతీ పల్లెకు తీసుకెళ్లాలని పార్టీ శ్రేణులకు సూచించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి వెలిచాల రాజేందర్‌రావు, ప్రొఫెషనల్ కాంగ్రెస్ తెలంగాణ ఇన్‌చార్జి అజీజ్, కరీంనగర్ ఇన్‌చార్జి ఫసియొద్దిన్, నవాబ్, కొరివి వేణుగోపాల్, మాసం రత్నాకర్ తదితరులు పాల్గొన్నారు.